క్లుప్తంగా

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

కొడిమ్యాల: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా సహకార శాఖ అధికారి మనోజ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాల సమీక్ష సమావేశం నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాలు నిర్వహించాలని, అన్ని సౌకర్యాలు కల్పించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సంపూర్ణంగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ రిజిస్టర్ మల్లేశం, కార్యదర్శులు, సహకార సంఘాల సిబ్బంది, ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలోచనలతో స్ఫూర్తి పొందాలి



అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం కృషి చేసిన అంబేడ్కర్ ఆలోచనలతో స్ఫూర్తి పొందాలని మగ్గిడి నర్సయ్య కోరారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (డిక్కీ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన నర్సయ్య జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నల్ల శ్యాం, మద్దెల నారాయణ, కూర్మాచలం ఉమా మహేష్, అనంతుల కాంతారావు, పులి గోవర్దన్, బిరుదుల లక్ష్మణ్, అశోక్, అటుకుల జాన్సన్, బడే శ్రీను, బిట్ల ప్రకాశ్, అంబేడ్కర్ వాదులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు గురుకుల విద్యార్థినులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు. ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో సీనియర్ ఖోఖో పోటీల్లో విద్యార్థులు ఎస్.రేవతి, సీహెచ్.సంజన, రణవి,జాసమిక, ఎస్.సంజన ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

మంచినీటి సమస్యకు పరిష్కారం



బోరు బాగు చేస్తున్న జీపీ సిబ్బంది

సాక్షి స్పందన

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రం శివారు గ్రామం లంబాడి తండా ఎల్లమ్మ ఆలయం సమీపంలోని రెండు బోరింగ్‌లు (చేతిపంపులు)పనిచేయకపోవడంపై వచ్చిన వార్తలపై స్పందించి ఆదివారం వాటికి మరమ్మతులను జరిపించి మంచినీటి సమస్యను పరిష్కరించారు. మాజీ సర్పంచ్ గర్షకుర్తి శిల్ప ఆధ్వర్యంలో లంబాడితండా, ఒడ్డెరగూడెం వాసులతో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొని సమస్యను తొలగించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు సైండ్ల శ్రీనివాస్, కడ రమేశ్ (వెల్డింగ్), గర్షకుర్తి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంగేళలో మెగా వైద్య శిబిరం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం మారుమూల ప్రాంతం మంగేళలో ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి హాజరైన వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఐఎంఏ జగిత్యాల శాఖ కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి,వైద్యులు డాక్టర్ రాజశేఖర్,డాక్టర్ శ్రవణ్‌కుమార్, డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ నివేదిత, డాక్టర్ మృదులరెడ్డి, డాక్టర్ రేగుంట ప్రశాంత్ పాల్గొన్నారు.

పశు వైద్యంపై పట్టింపేది?

- శిథిలావస్థలో పశు వైద్య భవనాలు
- భవనాలు కూలినా.. పట్టించుకోని పాలకులు
- ప్రతిపాదనలు బుట్టదాఖలు



రేచపల్లిలో కూలిపోయిన పశువైద్యశాల

సారంగాపూర్: పాడి పరిశ్రమను, వ్యవసాయానికి అనుబంధంగా గొర్రెలు, మేకలు, కోళ్లు, గేదెలు, ఆవుల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నామని చెబుతున్న పాలకులు, వాటి సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పశు వైద్య కేంద్రాలు, ఉపకేంద్రాలు ఏళ్లుగా శిథిలావస్థకు చేరుకోవడంతో రైతులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో 18 గ్రామాలు

సారంగాపూర్ మండలంలో మొత్తం 18 గ్రామాలు ఉండగా సారంగాపూర్‌లో పశువైద్యశాల, రేచపల్లి, అర్పపల్లి, పెంబట్ల–కోనాపూర్ గ్రామాల్లో మొత్తం మూడు పశువైద్య ఉపకేంద్రాల నుంచి రైతులకు సేవలందుతున్నాయి. మండలంలో మొత్తం 1708 ఆవులు, ఎద్దులు ఉన్నాయి. 3924 గేదెలు (బర్రెలు), 20,595 గొర్రెలు, 6,592 మేకలు, 24,697 కోళ్ళు ఉన్నట్లు పశుగణాంకాలు చెబుతున్నాయి. మండలంలో మొత్తం 15 డెయిరీఫాంలు రైతులు నిర్వహిస్తు పాల ఉత్పత్తిని పెంచడానికి శ్రమిస్తున్నారు.

ఉపకేంద్రాల పరిస్థితి ఇలా..

సారంగాపూర్ పశువైద్యకేంద్ర భవనం నూతన భవనం కాగా, రేచపల్లి పశువైద్య ఉపకేంద్రం పరిస్థితి దయనీయంగా ఉంది. దాదాపు 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం పైకప్పు దాదాపు సగం వరకు కూలిపోయింది. వర్షాలకు ఉపకేంద్రంలోకి నీరు వచ్చి చేరుతుంది. గోడలు పలు చోట్ల బీటలు వారి, ఏ క్షణమైనా కూలిపోతుందోనని అధికారులు, వైద్యసిబ్బంది భయపడుతున్నారు. ఇటీవల గ్రామంలో పశువైద్యశిబిరం నిర్వహిస్తున్న క్రమంలో భవనంలో పెద్ద పాము చొరబడి సిబ్బందిని హైరానా పెట్టేసింది. అర్పపల్లి పశువైద్య ఉపకేంద్రం పూర్తిగా కూలిపోవడంతో తాత్కాలికంగా గ్రామంలో ప్రభుత్వ భవనంలో పశువైద్యసేవలు అందిస్తున్నారు. ఒక్క పెంబట్ల–కోనాపూర్ ఉపకేంద్ర భవనం మాత్రం కొంత మెరుగైన దశలో ఉంది. ఆయా ఉపకేంద్రాల్లో సరిపడా స్టాఫ్ అందుబాటులో ఉంది. ఒక్క సారంగాపూర్ పశువైద్యశాలలో ఆఫీస్ సబార్డినేట్ పోస్టును భర్తీ చేయాల్సి ఉంది. వర్షాకాలంలో వర్షాలకు రేచపల్లి భవనంలో మందులు నిలువ ఉంచడం అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది.

నిధులు మంజూరైనా పనులు చేపట్టలేదు

గతంలో రేచపల్లి, అర్పపల్లి పశువైద్య ఉపకేంద్రాలకు రూ. 27 లక్షల చొప్పున రెండు నూతన భవనాలను నిర్మించాలని ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు చేపట్టకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పశు వైద్య కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించాలని కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి

మా గ్రామంలో ప్రతీ రైతుకు అనుబంధంగా పశువుల పెంపకాన్ని చేపట్టారు. రేచపల్లి ఉపకేంద్రం కింద రేచపల్లి, మ్యాడారంతండా, లచ్చనాయక్‌తండా, భీంరెడ్డిగూడం గ్రామాల పశువులకు సేవలందాలి. ఉపకేంద్ర పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. భవన నిర్మాణంకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. – బాస మల్లన్న, రేచపల్లి

ప్రతిపాదనలు పంపించాం



రేచపల్లి, అర్పపల్లి గ్రామాల్లో పశువైద్య ఉపకేంద్రాలకు నూతన భవనాల నిర్మాణం కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. – డాక్టర్ సునీల్, మండల పశువైద్యాధికారి,సారంగాపూర్

పంటలను దళారులకు అమ్మి నష్టపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

మెట్‌పల్లి: పంటలను దళారులకు విక్రయించి రైతులు నష్టపోవద్దని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ కూన గోవర్ధన్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు ధరలను అందించడం కోసమే ప్రభుత్వం కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మన్ తిప్పిరెడ్డి అంజిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డ్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ అంతపడుపుల పుష్పలత నర్సయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 13 కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల గంగాధర్, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మార్క్‌ఫెడ్ అధికారి నవీన్, ఏఎంసీ కార్యదర్శి సురేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, నాయకులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముందస్తు దీపావళి సంబరాలు



దీపావళి సంబరాల్లో విద్యార్థులు, టీచర్లు

రాయికల్: పట్టణంలోని విశ్వశాంతి ఉన్నంత పాఠశాలలో ఆదివారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో లక్ష్మీదేవి పూజలు నిర్వహించిన అనంతరం దీపావళి ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అనంతరం టపాసులు కాల్చారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మచ్చ లలిత, విద్యాన్వేశ్, ఉపాధ్యాయులు మహేశ్ ,అప్సర్, రంజిత్, శ్రీజ, సౌజన్య ,సంజన, హిందుజ, రజిత, మమత తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి అందజేత



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

కొడిమ్యాల: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ గ్రౌండ్‌లో సింగిల్ విండో చైర్మన్ రాజా నర్సింగరావు తల్లి ప్రేమలత– మురళీధరరావు స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో రాయల్ సూపర్ కింగ్స్ గోల్కొండ రాజు టీం మొదటి బహుమతి సాధించింది. అనిల్ రెడ్డి టీం రెండో బహుమతి సాధించింది. ఆదివారం నాడు మొదటి బహుమతికి 22,222 రెండో బహుమతి కి రూ.11,111 రూపాయలను ఎమ్మెల్యే సత్యం చేతుల మీదుగా స్పాన్సర్ రాజా నర్సింగరావు అందజేశారు. కార్యక్రమంలో సీఐ నీలం రవి, లక్ష్మణ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి



ఆర్థికసాయం అందిస్తున్న మెకానిక్ సంఘం సభ్యులు

కోరుట్ల: మెకానిక్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మెకానిక్స్ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షుడు తొడేటి బాబు అన్నారు. పట్టణానికి చెందిన మెకానిక్ సిరికొండ బాలరాజు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి మెకానిక్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రూ.75 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా తొడేటి బాబు మాట్లాడుతూ మెకానిక్‌లు ఆయిల్, గ్రీస్,పెట్రోల్ పొగ వల్ల అనారోగ్యం పాలవుతు అర్ధాంతరంగా చనిపోతున్నారని వాళ్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్, మెకానిక్స్ వెల్ఫేర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాసం రాంప్రసాద్, కోరుట్ల గౌరవ అధ్యక్షుడు శంకర్, పొలాస నరేశ్, రాష్ట్ర కార్యదర్శి ఎండీ ముజమ్మిల్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా లక్ష్మి



నియామకం పత్రం అందిస్తున్న ఆర్.కృష్ణయ్య

జగిత్యాలటౌన్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా మాజీ కౌన్సిలర్ అరవ లక్ష్మి ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ(రాజ్యసభ) ఆర్ కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. మాజీ కౌన్సిలర్‌గా, జగిత్యాల మున్సిపాలిటీలో బీజేపీ ఫ్లోర్‌లీడర్‌గా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా చురుకుగా పనిచేసిన అరవ లక్ష్మి సేవలను గుర్తించి ఈ నియామకం చేసినట్లు కృష్ణయ్య తెలిపారు. అరవ లక్ష్మి మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, బీసీ సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మిని పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

జిల్లా పద్మశాలీ ఉద్యోగుల కార్యవర్గం..



ఎన్నికైన నూతన కార్యవర్గం

జగిత్యాలటౌన్/జగిత్యాలరూరల్: తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం గౌరవ రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఆదివారం జగిత్యాల జిల్లా పద్మశాలీ ఉద్యోగుల సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇప్పన్నపెల్లి మురళి, సెక్రటరీగా అల్లె రాజేందర్, అసోసియేట్ అధ్యక్షులుగా గూడూరు శ్రావణ్, గాలిపెల్లి ఆనంద్, కోశాధికారిగా శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ రఘువరన్, మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, ఇరిగేషన్ ఎస్ఈ మిట్టపెల్లి రమేశ్ పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్ బస్ అద్దాలు ధ్వంసం

మల్యాల:మండలంలోని రాంపూర్ గ్రామంలో ప్రైవేట్ బస్సు అద్దాలు గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టారు. స్థానిక సబ్ స్టేషన్ వద్ద పార్కింగ్ చేసిన బస్సు అద్దాలు పగుల గొట్టారని నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని స్కూల్ యాజమాన్యం పోలీసులకు పిర్యాదు చేశారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలని ప్రచారం



ప్రచారం చేస్తున్న లైన్‌మన్ రాజు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో విద్యుత్ బకాయిలు చెల్లించాలని విద్యుత్ లైన్‌మెన్ కొలిపాక రాజు వాడవాడలో మైక్ ద్వారా ప్రచారం చేస్తున్నారు. గ్రామంలో విద్యుత్ బకాయిలు చెల్లించేందుకు విద్యుత్ శాఖ అధికారులు క్యాంపు నిర్వహించారు. కొంత మంది విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో లైన్‌మెన్ రాజు వాడవాడలో తిరుగుతూ మైక్ ద్వారా ప్రచారం చేసుకుంటు ఇంటింటికీ వెళ్లి విద్యుత్ బకాయిలు వసూలు చేస్తు రశీదులు అందజేస్తున్నారు. గ్రామంలో మైక్ ద్వారా ప్రచారం చేసుకుంటూ బిల్లులు వసూలు చేస్తున్న లైన్‌మెన్ రాజును గ్రామస్తులు, అధికారులు అభినందించారు.



కథలాపూర్: మండలంలోని కలిగోటలో పల్లె ప్రకృతి వనంలో పిచ్చి మొక్కలు అధికంగా ఉండటంతో అందులోకి వెళ్లేందుకు భయపడుతున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. పల్లె ప్రకృతివనంలో పచ్చని చెట్లు ఏపుగా పెరగడంతో ఆహ్లాదకర వాతావరణం ఉన్నప్పటికీ పిచ్చిమొక్కల బెడద వల్ల అందులోకి వెళ్లలేకపోతున్నామని ప్రజలు తెలిపారు. అధికారులు చొరవ చూపి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్,ఏఈ, ఎన్‌పీడీసీఎల్, సెల్ నంబర్: 8712486203

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి



మంత్రికి సమస్యను వివరిస్తున్న నాయకులు

మెట్‌పల్లి: పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం,ఉపాధ్యాయులు ఆదివారం ధర్మపురిలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించారని, దాని స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలని మంత్రికి వివరించారు. దీనికి మంత్రి 22న జరిగే కేబినేట్ సమావేశంలో ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకపోయి నిధులను మంజూరు చేయించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట తులసి ఆగమయ్య తదితరులున్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



తక్కళ్లపెల్లి శివారులో వాగు ఒడ్డు వద్ద నిల్వ చేసిన ఇసుక

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి గ్రామ శివారులో వాగులో నుంచి ట్రాక్టర్లు, టిప్పర్లలో అక్రమంగా ఇసుక తరలింపు యథేచ్ఛగా జరుగుతోంది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ శివారులోని వాగులో నుంచి ఇసుకను తోడేస్తుండటంతో గ్రామం పరిధిలో భూగర్భజలాలు అడుగంటిపోతాయని అభ్యంతరాలు చెప్పిన స్పందన కరువైందని గ్రామస్తులు మండిపడుతున్నారు. వాగులో ఇసుకను ట్రాక్టర్లతో తోడేసి డంపులు ఏర్పాటు చేసుకుని రాత్రి వేళల్లో లారీలు, టిప్పర్లలో తరలిస్తున్నారన్నారు. అక్రమంగా ఇసుకను తరలించే ట్రాక్టర్లు, టిప్పర్లు, లారీలు రాత్రివేళల్లో గ్రామం నుంచి వెళ్తుండటంతో భారీ శబ్దాలతో నిద్ర పట్టడంలేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చొరవ చూపి తక్కళ్లపెల్లి శివారు వాగులో నుంచి అక్రమ ఇసుక తరలింపును నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రాయికల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ధర్మపురి: ధర్మపురి పట్టణంలో ఆదివారం 1998–1999లో వివిధ పాఠశాలల్లో పదో తరగతి చదివిన ఎస్ఎస్సీ మిత్రులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తాము చదువుకున్నప్పటి జ్ఞాపకాలను నెమరేసుకుని రానున్న రోజుల్లో చేపట్టే కార్యక్రమాలపై చర్చించుకున్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు చిలువేరి కిరణ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు మ్యాన పవన్‌కుమార్, మిత్ర బృందం అధ్యక్షుడు సురేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు బుక శ్రీనివాస్, ఎండీ షబ్బీర్, ప్రధాన కార్యదర్శి సంగెం సురేశ్ తదితరులున్నారు.



ధర్మపురిలో మిత్రబృందం సమావేశం

రాయికల్: పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో 1999– 2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలే శేఖర్,ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.